




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 327 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/-
ఆదివారం 29 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## ట్రకోమా రహిత దేశంగా భారత్:మోదీ

**జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ట్రకోమా రహిత దేశంగా భారత్ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందు కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. మోదీ 123వ మన్కిబాత్ ఎపిసోడ్ నేడు ప్రసారమైంది. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను అభినందించారు. జూన్ 21న జరిగిన యోగాడే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేట మరింత విస్తరిస్తోందన్నారు.



చాలా మంది ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేయడంతోపాటు.. న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని మోదీ తెలిపారు. నాడు జార్జి ఫెర్నాండెజ్ను సంకెళ్లతో బంధించారన్నారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో.. ఎమర్జెన్సీ తొలగిపోయిందని చెప్పారు. దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొరార్జీ దేశాయ్, వాజ్పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ వినిపించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలన్నారు. ఫుట్బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని సూచించారు.

## పలు దేశాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షుల నియామకం

**హైదరాబాద్, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** పలు దేశాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు ఆయా పేర్లను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. త్వరలోనే ఆయా దేశాల్లో పూర్తిస్థాయి కమిటీలను వెల్లడిస్తామని తెలిపారు. వీటితో పాటు మహారాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా శ్రీనివాస్ సుల్గేను ఆమె నియమించారు.

న్యూజిలాండ్ – అరుణ జ్యోతి ముద్దం
గల్ఫ్ – చెల్లంశెట్టి హరిప్రసాద్
ఖతార్ మూకల ప్రవీణలక్ష్మి, అడ్వైజర్– నందిని అబ్బగోని
యూఏఈ – పీచర వేంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్
కువైట్ – మర్క ప్రమోద్ కుమార్
సౌదీ అరేబియా – మహమ్మద్ మొజ్జం అలీ ఇఫ్తెకార్
ఒమన్ – గుండు రాజేందర్ నేత
యూకే – సుమన్ రావు బల్మూరి
ఇటలీ – తానింకి కిశోర్ యాదవ్
ఫిన్లాండ్ – ఐరెడ్డి సందీప్ రెడ్డి
పోర్చుగల్ – ప్రకాశ్ పొన్నకంటి
మాల్టా– పింటు ఘోష్
కెన్యా – స్వప్నరెడ్డి గంట్ల
ఇరాక్, కుర్దిస్తాన్– మహ్మద్ సల్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి నాయక్వార్ రాం చందర్



## ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి పోలవరం పూర్తి:సీఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని విమర్శించారు. తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళ్తున్నాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్చార్జ్లకు ఆయన దిశానిర్దేశం చేశారు.



### ప్రజలకు అందుబాటులో ఉండాలి

"రాష్ట్ర విభజన వేళ అనేక సమస్యలు వచ్చినా నిలదొక్కుకున్నాం. వైకాపా పాలనతో రాష్ట్రం ధ్వంసమైంది. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ప్రజలకు చెప్పాం. వారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్లలో మనం ఏం చేయాలనేదానిపై ఇప్పటికే చర్చించాం. ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. అది మన బాధ్యత. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. సంక్షేమం అంటే ఏంటో చూపించిన పార్టీ మనది. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని పరిపాలన చేశాం. చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యం.

### ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్లో 703 సేవలు

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనం ఎప్పుడూ చేయం. కేంద్రం మనకు బాగా సాయం చేస్తోంది. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని చెప్పడం లేదు. ఇంకా చాలా పరిష్కరించాలి.. అదే మన లక్ష్యం. సేవ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నాం. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేశాం. రాజధాని ప్రాంతంలో పనులను పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చింది. రాబోయే ఏడాదిన్నరలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి జాతికి అంకితం చేస్తాం. స్టీల్ప్లాంట్కి రూ.11,400 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. క్రిష్ సిటీలో పనులు ప్రారంభమయ్యాయి. ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకున్నాం. వాట్సప్ గవర్నెన్స్ సుమారు 500 సేవలు ఆన్లైన్లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 703 సేవలు ఆన్లైన్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల అవినీతి తగ్గుతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన అందించే అవకాశం ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

## విజయవాడ దుర్గమ్మకు.. హైదరాబాద్ 'మహాకాళి' బోనం సమర్పణ

**విజయవాడ, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** హైదరాబాద్ మహాకాళి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. ఆషాడ మాసం సందర్భంగా భక్తులు ఈ కార్యక్రమం చేపట్టారు. మేళతాళాలు, కోలాటాలు, నృత్యాలు, భారీ ఊరేగింపుతో బోనాలను సమర్పించారు.

అంతకుముందు బ్రాహ్మణ వీధి నుంచి దుర్గమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. తెలంగాణకు చెందిన వివిధ కళారూపాలను ప్రదర్శించారు. 500 మంది కళాకారులు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. 15 ఏళ్లుగా మహాకాళి ఉత్సవాల కమిటీ ఈ ఆచారాన్ని కొనసాగిస్తోంది. కార్యక్రమంలో భాగంగా కళాకారులు ఇచ్చిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



## ఫోన్ ట్యాపింగ్ అంశంతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు:ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల సమస్యలను కాంగ్రెస్, భాజపా నేతలు పక్కదారి పట్టిస్తున్నారని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్పై ఓ మీడియా సంస్థ నిరాధారమైన వార్తలు ప్రసారం చేస్తోందని ఆరోపించారు. పోలీసులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు.

"ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని టీవీ సీరియల్లా నడిపిస్తున్నారు. మాజీ ఐపీఎస్ అధికారిగా టెలిగ్రాఫ్ చట్టం గురించి నాకు తెలుసు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు ఇవ్వరు. మాజీ పోలీస్ అధికారి ప్రభాకర్రావుకు అనేక మంది ఐపీఎస్ అధికారుల దగ్గర పనిచేసిన అనుభవం ఉంది. 2019లో ఆయన బెస్ట్ ఇంటెలిజెన్స్ అధికారిగా కేంద్రమంత్రి అమిత్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇంటెలిజెన్స్ విభాగం చాలా సున్నితమైంది. ఎవరి ఫోన్ అయినా ట్యాపింగ్ చేయాలంటే హెూంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్ణయం తీసుకుంటారు. ప్రభాకర్ రావు క్యాన్సర్ పేషెంట్. ఆయన్ను వేధిస్తున్నారు" అని ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ అన్నారు.



## పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి... తొక్కిసలాటలో ముగ్గురి మృతి

**పూరీ, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. గుండిచా ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. మృతులను ప్రేమకాంత మొహంతి (80), బసంతి సాహూ (36), ప్రభాతి దాస్ (42)గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రథయాత్ర ముగిసిన తర్వాత శనివారం జగన్నాథ ఆలయం నుంచి రథాలు శారద బలి వద్దకు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో రథాలపై ఉన్న దేవతలను చూడటానికి భక్తులు గుండిచా ఆలయం వద్దకు భారీగా చేరుకున్నారు. దర్శనం కోసం అందరూ ఒక్కసారిగా ముందుకు రావడంతో తొక్కిసలాట నెలకొంది. వెంటనే స్పందించిన భద్రతా బలగాలు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాయి. ఈ ఘటనపై ఒడిశా మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. పూరీ రథయాత్రకు శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక జనసమూహం, అలసట కారణంగా దాదాపు 750 మంది భక్తులు అస్వస్థతకు గురవ్వడంతో అధికారులు వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో చాలామందిని ప్రథమ చికిత్స తర్వాత డిశ్చార్జ్ చేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన 12 మంది భక్తులు కటక్లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## మెట్రో డీపీఆర్ ఇచ్చింది గత వారమే
### :సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** మెట్రో డీపీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. "రేవంత్రెడ్డి కోసమో.. కాంగ్రెస్ పార్టీ కోసమో పని చేయం. తెలంగాణ ప్రజల కోసమే పని చేస్తాం. మెట్రో డీపీఆర్ గత వారమే కేంద్రానికి ఇచ్చారు. మెట్రో రైలు సాధ్యసాధ్యాలపై కేంద్రం పరిశీలిస్తోంది. భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం కావాలని కోరుకుంటున్నా. దీనికి సంబంధించి సాయంత్రం నోటిఫికేషన్, రేపు నామినేషన్, ఎల్లుండి ఎన్నిక ఉంటుంది" అని కిషన్ రెడ్డి తెలిపారు.



## తెదేపా విస్తృతస్థాయి సమావేశం ప్రారంభం

**అమరావతి, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ప్రారంభమైంది. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్ఛార్జులు, పరిశీలకులు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై రెండో తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటి ప్రచారంపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై ప్రధానంగా చర్చించనున్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు, మూడు పార్టీల సమన్వయంపై చర్చించనున్నారు.

## తాడిపత్రికి కేతిరెడ్డి పెద్దారెడ్డి..
### అడ్డుకునేందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి యత్నం

**తాడిపత్రి, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉదయం తాడిపత్రిలోని తన నివాసానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్రెడ్డి.. పెద్దారెడ్డి ఇంటివైపు బయలుదేరారు. తాడిపత్రికి రావొద్దంటూ ఆయన్ను అడ్డుకునేందుకు యత్నించారు.



మరోవైపు పరిసర గ్రామాల నుంచి తెదేపా కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. పెద్దారెడ్డి ఇంటిని చుట్టుముట్టేందుకు వారు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్రెడ్డి ఇళ్ల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘర్షణ జరిగే అవకాశం ఉండటంతో పెద్దారెడ్డి ఇంటి వద్దకు పోలీసులు చేరుకున్నారు. ఆయన్ను వాహనంలో ఎక్కించుకొని అనంతపురం తీసుకెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దారెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాను గెలిచినా, ఓడినా తాడిపత్రిలో ఫ్యాక్షనిజం చేస్తానని చెప్పారు. దీంతో తెదేపా నేతలు గత కొంత కాలంగా ఆయన్ను తాడిపత్రికి రాకుండా అడ్డుకుంటున్నారు. తాజాగా ఆదివారం కూడా ఆయన్ను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

## కరెంటు స్తంభాన్ని ఢీకొన్న బస్సు.. తప్పిన పెను ప్రమాదం



**మొవ్వ, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):** కృష్ణా జిల్లా మొవ్వ మండలం నిడమోలులో తృటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసం కాగా, కరెంటు స్తంభం విరిగి నేలపై పడింది. ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే బస్సు అదుపుతప్పినట్లు పోలీసులు గుర్తించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వెకేషన్‌లో సూర్య - జ్యోతిక.. వీడియో వైరల్



సినిమాల నుంచి ఏమాత్రం విరామం దొరికినా ఫ్యామిలీతో సమయం గడపటానికి ఇష్టపడుతుంటారు నటుడు సూర్య. తాజాగా ఆయన తన సతీమణి, నటి జ్యోతికతో కలిసి వెకేషన్కు వెళ్లారు. తూర్పు ఆఫ్రికాలోని సీషెల్స్కు ఈ జంట విహార యాత్రకు వెళ్లింది. సముద్రం, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వీరిద్దరూ సేదతీరారు. దీనికి సంబంధించిన ఒక స్పెషల్ వీడియోను జ్యోతిక ఇన్స్టా వేదికగా షేర్ చేశారు. 'స్వర్గంలో మరో రోజు మనిద్దరం' అని ఆమె క్యాప్షన్ జత చేశారు. ఈ వీడియో వైరల్ గా మారింది. కెరీర్ పరంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్నారు నటుడు సూర్య. 'కంగువా', 'రెట్రో' మిశ్రమ స్పందనలకే పరిమితం కావడంతో.. ప్రస్తుతం ఆయన దృష్టి కొత్త ప్రాజెక్టుల పైనే ఉంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్య దేవర నాగవంశీ దీనిని నిర్మిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. ఇది పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రం అని.. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయని దర్శకుడు అన్నారు. 'గజిని'లో సంజయ్ రామస్వామి పాత్రకు సంబంధించిన షేడ్స్ ఈసినిమాలో హీరో పాత్రకు ఉంటాయని తెలిపారు. దీనితోపాటు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు'లో సూర్య నటిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## నిన్ను కొట్టను, తిట్టను.. ఒక్కసారి వచ్చి కలువు: లారెన్స్



'విక్రమార్కుడు'లో బాలనటుడిగా కనిపించి ప్రేక్షకులను అలరించాడు రవి రాథోడ్. సెట్ వర్క్ చేస్తూ జీవితాన్ని గడుపుతున్న అతడు గతంలో ఓ ఇంటర్వ్యూలో రాఘవ లారెన్స్ గురించి మాట్లాడాడు. దీనిపై తాజాగా లారెన్స్ స్పందించారు. "ఈ వీడియో చూసి నా హృదయం తరుక్కుపోయింది. 'మాస్' సినిమా షూటింగ్లో తనని కలిశాను. అప్పట్లో ఓ స్కూల్లో చేర్పించాను. కాకపోతే ఏడాది తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడని చెప్పారు. అతడిని కలిసేందుకు ఎంతో ప్రయత్నించా. ఇన్నేళ్ల తర్వాత అతడిని చూస్తుంటే భావోద్వేగంగా ఉంది. అలా, చెప్పకుండా వెళ్లిపోయినందుకు నేను కోప్పడతానేమోనని భయపడుతున్నట్లు ఇంటర్వ్యూలో చెప్పాడు. నిజం చెప్పాలంటే, నిన్ను కొట్టను, తిట్టను. కేవలం ఒక్కసారి చూడాలని మాత్రం ఉంది. దయచేసి నన్ను వచ్చి కలువు. నీకోసం ఎదురుచూస్తుంటా" అని లారెన్స్ పేర్కొన్నారు. రవి రాథోడ్ బాల నటుడిగా 50కి పైగా చిత్రాల్లో నటించాడు. 'విక్రమార్కుడు'లో ఓ సరదా సీక్వెన్స్లో కనిపించి ప్రేక్షకులను అలరించాడు. అవకాశాల వేటలో తాను అలసిపోయానని.. అందుకే సెట్ వర్క్ చేస్తున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతి చెందారని.. స్నేహితులతో కలిసి ఉంటున్నానన్నాడు. అనంతరం రాఘవా లారెన్స్ గురించి చెబుతూ.. ఆయన తనని దత్తత తీసుకున్నారని.. ఓ స్కూల్లో జాయిన్ చేయించారన్నాడు. కాకపోతే తాను ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదన్నాడు. సెలవుల సమయంలో హాస్టల్ నుంచి పారిపోయాయని.. ఆతర్వాత అక్కడికి వెళ్లలేదన్నాడు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1858** : పనామా కాలువను కట్టిన ఇంజినీరు జార్జి వాషింగ్టన్ గోఎథల్స్ జననం (మ. 1928).
- **1879** : భారత రాజకీయనాయకుడు, బళ్ళారికి చెందిన దివ్యజ్ఞాన సమాజస్థుడు ఆర్కాట్ రంగనాథ మొదలియారు జననం (మ. 1950).
- **1893** : భారత ప్రణాళిక పథానికి నిర్దేశకుడిగా పేరు పొందిన పి.సి.మహలనోబిస్ జననం (మ. 1972). (చిత్రంలో)
- **1916** : బోయింగ్ విమానం మొదటిసారిగా ఎగిరిన రోజు.
- **1976** : బ్రిటిష్ ప్రభుత్వం నుంచి సేషెల్స్ దేశం స్వాతంత్రం పొందినది.
- **1998** : తెలుగు సినిమా దర్శకుడు కమలాకర కామేశ్వరరావు మరణం (జ. 1911).
- **2024**: ఇండియా రెండో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.


జార్జి వాషింగ్టన్ గోఎథల్స్


ఆర్కాట్ రంగనాథ


పి.సి.మహలనోబిస్


బోయింగ్ విమానం


సేషెల్స్


కమలాకర కామేశ్వరరావు


ఇండియా రెండో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం

## 'కాంటా లగా' ఫేమ్ షఫాలీ మృతి.. కారణమిదేనా..?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్, నటి షఫాలీ జరివాలా (42) ఆకస్మిక మరణం చిత్ర పరిశ్రమను, ఆమె అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమె కార్డియాక్ అరెస్ట్తో మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ ముంబయి పోలీసులు మాత్రం ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈనేపథ్యంలో ఆమె మృతికి గల కారణాలపై పలు కథనాలు నెట్టింట వైరల్ గా మారాయి. అందంపై ఉన్న ఇష్టమే ఆమె ప్రాణం తీసిందని పలువురు అంటున్నారు. షఫాలీ కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్స తీసుకుంటున్నారని సమాచారం. శుక్రవారం ఉదయం ఇంట్లో పూజా కార్యక్రమాలు జరగడంతో ఆమె ఉదయం నుంచి ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతోనే యాంటీ ఏజింగ్కు సంబంధించిన ఇంజెక్షన్లు, ఔషధాలు తీసుకోవడంతో కార్డియాక్ అరెస్ట్తో ఉంటారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. శుక్రవారం రాత్రి షఫాలీ అస్వస్థతకు గురవడంతో ఆమె భర్త పరాగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కార్డియాక్ అరెస్టుతో ఆమె మృతిచెందినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. కుటుంబసభ్యులు దాన్ని ధ్రువీకరించలేదు. "శుక్రవారం రాత్రి 11.15 గంటలకు ఆమెను ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది" అని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 2002లో వచ్చిన 'కాంటా లగా' రీమిక్స్ సాంగ్తో కుర్రకారు మదిని దోచిన షఫాలీ జరివాలా ఒక్కసారిగా ఫేమస్ అయ్యారు. దీంతో అంతటా 'కాంటా లగా గర్ల్'గా గుర్తింపు తెచ్చుకున్నారు. సల్మాన్ ఖాన్ సినిమా 'ముజ్సే షాదీ కరోగీ', పునీత్ రాజ్కుమార్ 'హుడుగారు'లో ఆమె అవకాశాలు దక్కించుకున్నారు. అనంతరం షఫాలీ పలు టీవీ రియాలిటీ షోలలో మెరిశారు. హిందీ బిగ్బాస్ 13 లోకి సైతం ఎంట్రీ ఇచ్చారు. తొలుత గాయకుడు హర్మీత్ సింగ్ను ఆమె పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరు విడిపోయారు. అనంతరం నటుడు పరాగ్ త్యాగిని వివాహమాడారు.

ప్రజా రిపబ్లిక్
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

### 17 ఏళ్ల తర్వాత నెరవేరిన పొట్టి కప్ కల..

## రోహిత్, కోహ్లీల వీడ్కోలుకు నేటికి ఏడాది




భారత క్రికెట్లో జూన్ 29, 2024కు ఓ ప్రత్యేకత ఉంది. టీమ్ ఇండియా రెండో టీ20 ప్రపంచ కప్ సాధించి సరిగ్గా నేటికి ఏడాది. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 7 పరుగుల తేడాతో గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత్ పొట్టి కప్పును సాధించడం విశేషం. ఈ మ్యాచ్ ముగిసిన అనంతరం రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ టీ20 కెరీర్కు రిటైర్మెంట్ ప్రకటించారు. 2024 టీ20 వరల్డ్ కప్ సాధించి రాహుల్ ద్రావిడ్ కూడా సగర్వంగా కోచ్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యాడు. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆటగాళ్లంతా అతడిని ఎత్తుకొని సంబరాలు చేసుకుని గొప్పగా వీడ్కోలు పలికారు.

**హార్దిక్ ఎమోషన్.. పిచ్ మట్టి రుచి చూసిన రోహిత్**

2024 ప్రపంచ కప్ ముందు వరకు ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో రోహిత్, హార్దిక్ మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు వచ్చాయి. అయితే, ఫైనల్ అనంతరం వాటన్నింటికి చెక్ పడింది. హార్దిక్ కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురికాగా.. రోహిత్ అతడిని హత్తుకుని ఓదార్చాడు. టీమ్ ఇండియాకు రెండో టీ20 ప్రపంచ కప్ అందించిన బార్బడోస్ మైదానం పిచ్ను జీవితాంతం గుర్తుంచుకునేలా.. రోహిత్ పిచ్పై ఉన్న మట్టిని నోట్లో వేసుకున్నాడు. అప్పట్లో ఈ వీడియో వైరల్ గా మారింది.

**'రోబో'లా హిట్మ్యాన్.. చరిత్రలో నిలిచిపోయే సూర్య క్యాచ్**

టీ20 ప్రపంచ కప్పు అందుకొనే సమయంలో రోహిత్ 'రోబో'లా వచ్చాడు. డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ రిక్ ఫ్లెయిర్ స్టైల్లో ఇలా చేశాడు. రోహిత్ను ఇలా రమ్మని కుల్దీప్ యాదవ్ చెప్పాడు. చివరి ఓవర్ లో మొదటి బంతికి డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్ని బౌండరీ లైన్ వద్ద తన శరీర బరువును నియంత్రించుకుంటూ సూర్యకుమార్ యాదవ్ అద్భుతంగా అందుకున్నాడు. అప్పటికి సఫారీల చేతిలో ఉన్న మ్యాచ్ ఈ క్యాచ్తో భారత్ వైపు మళ్లింది. ఈ క్యాచ్ సూర్య కెరీర్లోనే కాకుండా భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**కోహ్లి, అక్షర్ కీలక ఇన్నింగ్స్**

టోర్నీలో విఫలమైన కోహ్లి.. (76బీ 59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సు) ఫైనల్లో మాత్రం అదరగొట్టాడు. రోహిత్ (9), పంత్ (0), సూర్యకుమార్ (3) విఫలమైన వేళ క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ (47బీ 31 బంతుల్లో) కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారత్ 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. బౌలింగ్లో హార్దిక్ పాండ్య (3/20), బుమ్రా (2/18), అర్షదీప్ (2/20) సమష్టిగా రాణించి సఫారీలను 169/8కి కట్టడి చేసి భారత్కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు.

## ఇంటి చిట్కాలు

## నిల్వ ఉంచిన చేపలతో మీ ఆరోగ్యం ఢమాల్, తాజా తాజా చేపలు ఎలా కొనాలో తెలుసా?

చాలా మంది చేపలు పులుసు లొట్టలేసుకుని తింటారు. అయితే, మీరు తినే చేప ఫ్రెషేనా అని ఎప్పుడైనా ఆలోచించారా..? నిల్వ ఉంచిన చేపలు కొని తింటే ఏమవుతుందో తెలుసా?

ఈ రోజుల్లో చాలామందికి చేపలంటే మహా ఇష్టం. సండే వచ్చిందంటే చాలు, చేపల పులుసు, ఫ్రై, బిర్యానీ వంటివి లాగించేస్తుంటారు. కేవలం రుచి కోసమే కాదు, ఆరోగ్యానికీ చేపలు ఎంతో మంచివి. చేపల్లో మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు మెండుగా ఉంటాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి, విటమిన్ బి2, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, అయోడిన్, ప్రోటీన్ వంటి ఎన్నో పోషకాలు మెండుగా ఉన్నాయి. ఆదివారం చేపల పులుసు చేసుకుని తింటే ఆ కిక్కే వేరు. అయితే, చాలా మంది చేపల్ని కొనేటప్పుడు పప్పులో కాలేస్తారు. మంచి చేపల్ని కొనడంలో పొరబడుతుంటారు. ఫ్రెష్ చేపలు కొనకపోతే కూర వాసన నీచు కంపు కొడుతుంది. అంతేకాకుండా నిల్వ ఉంచిన చేపల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ నుంచి తాజా చేపలు ఎలా కొనాలో కొన్ని చిట్కాల ద్వారా ఇప్పుడు తెలుసుకుందాం.

### కళ్లను పరిశీలించండి



తాజా చేపలు:కళ్ళు స్పష్టంగా, మెరిసేలా, బయటికి పొడుచుకు వచ్చినట్లుగా ఉంటాయి. అంతేకాకుండా తడిగా ఉంటాయి.
నిల్వ ఉంచిన చేపలు:కళ్ళు మసకబారినట్లు, లోపలికి కుంగిపోయినట్లు లేదా తెల్లటి పొర ఏర్పడినట్లు ఉంటాయి. ఇలాంటి చేపల్ని ఎట్టి పరిస్థితుల్లో కొనకండి.



### వాసన



తాజా చేపలు:ఈ చేపలకి తేలికపాటి సముద్రపు వాసన లేదా తాజా నీటి వాసన మాత్రమే వస్తుంది. ఎటువంటి అసహ్యకరమైన, ఘాటైన లేదా మురికి వాసన రాదు.
పాత చేపలు:అదే నిల్వ ఉంచిన చేపల వాసన వేరుగా ఉంటుంది. ఈ చేపల నుంచి చాలా ఘాటైన, మురికి లేదా అమ్మోనియా వాసన వస్తుంది. ఇది చేపలు పాడైపోయాయని సూచిస్తుంది.

### మొప్పల ద్వారా గుర్తించండి



తాజా చేపలు: వీటి మొప్పలు తేమగా, ప్రకాశవంతమైన ఎరుపు లేదా గులాబీ రంగులో ఉంటాయి. అవి జీవంగా కనిపిస్తాయి.
నిల్వ ఉంచి చేపలు: వీటి మొప్పలు లేత గులాబీ, గోధుమ లేదా బూడిద రంగులో ఉంటాయి. అవి జిగురుగా లేదా పొడిగా ఉండవచ్చు. రక్తం గడ్డకట్టినట్లు ఉంటే అవి ఐస్ ప్యాక్‌లలో నిల్వ ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు.

### చర్మాన్ని, మాంసాన్ని పరీక్షించండి



తాజా చేపలు: వీటి చర్మం మెరుస్తూ, తడిగా, జారే స్వభావం కలిగి ఉంటుంది. పొలుసులు గట్టిగా అతుక్కుని ఉంటాయి. చేపను వేలితో నొక్కినప్పుడు, మాంసం వెంటనే తిరిగి పూర్వ స్థితికి రావాలి. శరీరం గట్టిగా ఉండాలి.
పాత చేపలు: అదే నిల్వ ఉంచిన చేపల చర్మం నిస్తేజంగా, జిగురుగా ఉండవచ్చు. పొలుసులు సులభంగా ఊడిపోతాయి. వేలితో నొక్కినప్పుడు మాంసం లోపలికి వెళ్ళి అలాగే ఉండిపోతే, అది పాత చేప. శరీరం మెత్తగా, వదులుగా ఉంటుంది.

### తోక ద్వారా గుర్తించండి



తాజా చేపలు:ఫ్రెష్ చేపల తోక మెరుస్తూ, నిటారుగా ఉంటుంది.
పాత చేపలు:నిల్వ ఉంచిన చేపల తోక రంగు కోల్పోయి, వాడిపోయినట్లు లేదా పొడిగా ఉంటుంది.

### ఈ విషయాలు ముఖ్యం



- చేపలను కొన్న తర్వాత నీటిలో ఉంచడం కన్నా ఐస్‌లో ఉంచడం మంచిది. ఐస్‌లో ఉంచిన చేపలు చల్లగా, తాజాగా ఉంటాయి. నీటిలో ఉంచితే వాసన వచ్చి, ఆరోగ్యానికి హాని కలిగే అవకాశం ఉంది.
- ఎక్కువ మంది జనం కొనుగోలు చేసే, తరచుగా స్టాక్ మారే ఫిష్ మార్కెట్‌ను ఎంచుకోవడం మంచిది. అక్కడ చేపలు తాజాగా ఉండే అవకాశం ఎక్కువ.
- నిల్వ ఉంచిన లేదా పాడైన చేపలను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ఫుడ్ పాయిజినింగ్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. చేపలు పాడైపోతున్న కొద్దీ వాటిలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, ప్రోటీన్లు వంటి పోషకాలు క్షీణిస్తాయి. దీంతో మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు లభించవు.
- నిల్వ ఉంచిన చేపలు అసహ్యకరమైన రుచిని, ఘాటైన వాసనను కలిగి ఉంటాయి. ఇది తినడానికి అసౌకర్యంగా ఉంటుంది.

